క్లుప్తంగా

ఆస్పత్రిని సందర్శించిన కాయకల్ప టీం సభ్యులు



ఆస్పత్రిలో కాయకల్ప టీం సభ్యులు

రాయికల్: పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను మంథనిలోని కాయకల్ప ప్రోగ్రాం టీం సభ్యులు బుధవారం సందర్శించారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవలు, ప్రసవాల సంఖ్య వంటి వివరాలను ఆరా తీశారు. వీరి వెంట సూపరింటెండెంట్ రవి, వైద్యులు రమేశ్, శశికాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు ఉద్యమించాలి



సంతకాల సేకరణలో నాయకులు

జగిత్యాల: నూతన జాతీయ విధానం రద్దు కోసం విద్యార్థులు ఉద్యమించాలని ఏఐఎస్ఎఫ్ నాయకుల డిమాండ్ అన్నారు. బుధవారం సంతకాల సేకరణ చేపట్టారు. జాతీయ విద్యా విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం విద్యను నిర్వీర్యం చేస్తూ పేదలకు ఇబ్బంది కలిగిస్తోందన్నారు. ఈ విధానంతో విద్యార్థులు నాణ్యమైన విద్య కోల్పోతున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అక్రమాలిక్, సంజయ్, రాహుల్, నాగరాజు పాల్గొన్నారు.

మార్కెట్ నిర్మాణానికి స్థల పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న జెడ్పీసీఈవో

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం వెల్లులలో నూతనంగా మార్కెట్ నిర్మించేందుకు జెడ్పీ సీఈవో రఘువరన్ బుధవారం స్థలం పరిశీలించారు. లన జరిపారు. అనంతరం గ్రామంలో పల్లెప్రకృతివనం, సంపదవనాలను సందర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భీమేశ్ రెడ్డి, పీఆర్ ఏఈ అన్వర్, ఏపీవో తిరుపతి, సర్పంచ్ రజిని,నాయకులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న రజితరావు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని మానస హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు జాతీయస్థాయి ఒలింపియాడ్ పరీక్షల్లో అత్యంత ప్రతిభ కనబర్చారు. రాగిళ్ల విశ్వతేజ జాతీయస్థాయిలో మొదటి ర్యాంక్ సాధించి ప్రావీణ్య పురస్కార్‌కు ఎంపికయ్యాడు. అలాగే దుర్గ మేఘశ్రీ, సహస్ర ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా వారిని డైరెక్టర్ రజితరావుఅభినందించారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థిని



విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

జగిత్యాలరూరల్: మండలంలోని కండ్లపల్లి మోడల్‌స్కూల్‌కు చెందిన విద్యార్థిని శాన్వి ఎస్జీఎఫ్–1 అండర్ –14 కబడ్డీ పోటీల్లో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ వినిత్‌కుమార్, అజీమ్ తెలిపారు. ఇటీవల జనగామ జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో శాన్వీ అత్యంత ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ఈనెల 26 నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కడప జిల్లాలో జరిగే కబడ్డీ పోటీల్లో తెలంగాణ రాష్ట్ర జట్టు తరుపున శాన్వీ ప్రాతినిధ్యం వహించనుంది. బుధవారం ప్రిన్సిపాల్ నాగ సుధారాణి, వైస్ ప్రిన్సిపల్ రవీందర్, ఉపాధ్యాయులు అభినందించారు.

సామూహిక కుంకుమార్చన

రాయికల్: మండలంలోని ఇటిక్యాల సాయిబాబా ఆలయంలో కుంభాభిషేక మహోత్సవంలో భాగంగా బుధవారం మహిళల సామూహిక కుంకుమార్చన, మంత్రపుష్పం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయప్ప చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ నివేదిత కృష్ణారావు, వైస్‌చైర్మన్ హిమవంతరావు, సర్పంచ్ సామల్ల లావణ్య, ఎంపీటీసీ రాధ పాల్గొన్నారు.

నిధులు మంజూరైనా.. పనుల్లో జాప్యం

- హెల్త్ సబ్‌సెంటర్లకు సొంత భవనాలు కరువు
- మెట్‌పల్లి మండలంలో ఆరు భవనాలకు నిధులు
- రెండు చోట్ల పనులు ప్రారంభం
- అద్దె భవనాలు, ఇరుకు గదుల్లో నిర్వహణతో ఇబ్బందులు



మెట్ల చిట్టాపూర్‌లో స్లాబ్ దశలో హెల్త్ సబ్ సెంటర్

మెట్‌పల్లిరూరల్: గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలందించే హెల్త్ సబ్ సెంటర్లకు సొంత భవనాలు కరవయ్యాయి. చాలా చోట్ల అద్దె భవనాలు, ఇరుకైన గదుల్లో కేంద్రాలను నిర్వహిస్తుండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.మెట్‌పల్లి మండలంలో నూతన హెల్త్ సబ్ సెంటర్ల నిర్మాణానికి నిధులు మంజూరైనా.. పనుల్లో జాప్యం జరుగుతోంది.

ఒక్కో నిర్మాణానికి రూ.20 లక్షలు

మెట్‌పల్లి మండలంలోని మొత్తం ఆరు గ్రామాల్లో హెల్త్ సబ్ సెంటర్లు ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.ఇందులో వేంపేట, వెల్లుల, జగ్గాసాగర్, మెట్లచిట్టాపూర్, కొండ్రికర్ల, మేడిపల్లి గ్రామాల్లో సెంటర్ల ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఒక్కో హెల్త్ సబ్ సెంటర్ నిర్మాణానికి రూ.20 లక్షలు నిధులు మంజూరు కాగా, నిర్మాణ పనులకు కోరుట్ల మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు శంకుస్థాపన చేశారు. అయితే మెట్లచిట్టాపూర్, జగ్గాసాగర్‌లో పనులు ప్రారంభమై స్లాబ్ దశలో ఉండగా, మిగతా నాలుగు చోట్ల ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదు. దీంతో కొన్ని చోట్ల గ్రామ పంచాయతీల్లో నిర్వహిస్తుండగా, మరికొన్ని చోట్ల అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు. ఫలితంగా అటు సిబ్బందికి, ఇటు సెంటర్లకు వచ్చే వారికి అవస్థలు తప్పడం లేదు.

తీరనున్న కష్టాలు..

హెల్త్ సబ్ సెంటర్లకు సొంత భవనాలు లేక ప్రస్తుతం గ్రామ పంచాయతీల్లోని ఆదనపు గదులు, ఇతర చోట్ల ఒకే గదిలో నిర్వహిస్తున్నారు. దీంతో సెంటర్‌కు వైద్య సేవల కోసం వచ్చే చిన్నారులు ,గర్భిణులు, ఇతరులకు అసౌకర్యాలతో అవస్థలు తప్పడం లేదు.అలాగే మందులు పెట్టడానికి, రికార్డులు భద్రపరచడానికి, ఇతర అవసరాలకు సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.అదే సొంత భవనాల్లో ఐదు గదులు ఉండేలా ప్రణాళికలు రూపొందించారు. దీంతో నూతన భవనాల నిర్మాణాలు పూర్తయితే ఇబ్బందులు తప్పనున్నాయి.అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి హెల్త్ సబ్ సెంటర్లు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కాంట్రాక్టర్లకు నోటీసులు ఇచ్చాం

మండలంలోని హెల్త్ సబ్ సెంటర్ల భవన నిర్మాణాల పనులకు సంబంధించి టెండర్లు, అగ్రిమెంట్ పూర్తయ్యాయి. రెండు చోట్ల పనులు ప్రారంభమయ్యాయి. మిగతా చోట్ల పనులు ప్రారంభం కావాల్సి ఉంది. పనుల్లో జాప్యంపై కాంట్రాక్టర్లకు నోటీసులు ఇచ్చాం.త్వరగా పూర్తి చేసేలా చర్యలు చేపడుతాం.

– అన్వర్, ఏఈ, పంచాయతీరాజ్, మెట్‌పల్లి

చెరువుకట్ట మరమ్మతులకు ప్రత్యేక నిధులు

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్: చెరువుకట్ట మరమ్మతులకు ప్రత్యేక నిధులు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. బుధవారం తిప్పన్నపేట గ్రామ శివారులోని ముప్పాల చెరువు కట్టను పరిశీలించి గంగమ్మతల్లి ఆలయంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిప్పన్నపేట రైతులు వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో కట్ట మరమ్మతులు చేపట్టేందుకు ప్రత్యేక నిధుల ద్వారా అభివృద్ధి పనులు చేపడతామన్నారు. అలాగే గంగమ్మతల్లి ఆలయాభివృద్ధికి రూ.10 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో లైశెట్టి విజయ్, మదు, చంద్రన్న, గంగపుత్ర నాయకులు పాల్గొన్నారు.

ఉగాది నుంచి రూ.4 వేల పింఛన్

జగిత్యాలరూరల్: ఉగాది నుంచి లబ్ధిదారులకు రూ.4 వేల పెన్షన్ అందిస్తామని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ మున్నూరుకాపు సంఘం భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ శీలం సురేందర్, సుమారు 100 మంది కాంగ్రెస్‌లో చేరారు. ఎన్నికల ముందుకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. జిల్లాకేంద్రంలో ఎస్సారెస్పీ భూమిని కాపాడానని, ప్రస్తుతం అక్కడ ప్రభుత్వ కార్యాలయాలు నిర్మాణం అయ్యాయని తెలిపారు. విద్యానగర్‌లో రామాలయం భూమి, ధరూర్ క్యాంప్‌లోని కోదండరామాలయం భూమి కబ్జా కాకుండా కాపాడానన్నారు. ఏడాదిలోపు ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీని ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో శీలం మల్లేశం, గాజంగి నందయ్య, జున్ను రాజేందర్, పుప్పాల అశోక్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కోరుట్లలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కోరుట్ల: పట్టణంలోని అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానించింది. బుధవారం మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని చైర్‌పర్సన్ అన్నం లావణ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, పట్టణంలోనే అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రభుత్వానికి విన్నవిస్తూ ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సమావేశంలో 3 అంశాలను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ పట్టణంలో సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామన్నారు. వార్డుల్లో పెండింగ్‌లో ఉన్న పన్నులు ప్రజలు త్వరితగతిన చెల్లించే విధంగా కౌన్సిలర్లు సహకరించాలని మున్సిపల్ చైర్మన్ అన్నం లావణ్య కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్, వైస్ చైర్మన్ పవన్,అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్

వెల్గటూర్ : యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. వెల్గటూర్‌లో మాజీ జెడ్పీటీసీ దోరిశెట్టి వెంకటయ్య భార్య శంకరమ్మ, కుమారుడు సతీశ్ జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న ధర్మపురి నియోజకవర్గస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను బుధవారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన కీలకపాత్ర పోషించారన్నారు. వెల్గటూర్ జెడ్పీ హైస్కూల్‌కు వెంకటయ్య సొంత స్థలం ఇచ్చారని, ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ కూనమల్ల లక్ష్మి, వెల్గటూర్, ఎండపల్లి మండలాల అధ్యక్షులు రాంచంద్రం, జగన్, ప్రధాన కార్యదర్శి కుమార్, సీనియర్ నాయకులు నర్సింగరావు, సర్పంచులు, ఎంపీటీసీలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కోసం వస్తే గొలుసు మాయం

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని పాతబస్టాండ్ సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో రంగదాముని పల్లికి చెందిన సునీత ఆరోగ్య సమస్యతో ఆస్పత్రిలో చేరింది. గతంలో పిల్లలు కాకుండా ఆపరేషన్ జరిగింది. ఏడాది తర్వాత ఆపరేషన్ వికటించడంతో మళ్లీ ఆస్పత్రికి రెండు రోజుల క్రితం వచ్చింది. మంగళవారం ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగానే ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసు మాయమైంది. దీంతో ఆమె భర్త 100కు ఫోన్ చేయగా విచారణ చేపడుతున్నారు.

అనారోగ్యంతో బాలింత మృతి

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని మాతా శిశు కేంద్రంలో ఓ మహిళ ఈనెల 17న ప్రసవించి బాబుకు జన్మనిచింది. తర్వాత మహిళకు తీవ్ర అనారోగ్యానికి గురికాగా, వైద్యులు చికిత్స అందించినప్పటికీ కోలుకోకపోవడంతో సివిల్ ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఇక్కడ కూడా తగ్గకపోవడంతో కరీంనగర్ ప్రతిమ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది.

అంగన్‌వాడీ కేంద్రాలకు బీరువాలు అందజేత

పెగడపల్లి: మండలంలోని మద్దులపల్లి గ్రామాల్లోని రెండు అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ బీరువాలు అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రికార్డులు భద్రపరిచేందుకు బీరువాలు అందజేయాలని అంగన్‌వాడీ టీచర్లు విన్నవించుకున్నారు. దీంతో లక్ష్మణ్‌కుమార్ వాటిని సమకూర్చగా కాంగ్రెస్ నాయకులు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శైలజ, శోభ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నేడు జగిత్యాలలో కవిత పర్యటన

జగిత్యాల: జిల్లాలో ఎమ్మెల్సీ కవిత గురువారం పర్యటించనున్నారు. జగిత్యాల జైలులో ఉన్న హబ్సీపూర్ సర్పంచ్ రాజేశ్వర్‌రెడ్డిని ఉదయం 11 గంటలకు పరామర్శించి, మధ్యాహ్నం 12 గంటలకు రాయికల్ మండలం ఇటిక్యాల సాయిబాబా ఆలయంలో జరుగుతున్న మహాకుంభాభిషేకంలో పాల్గొననున్నారు.

డీసీబీఆర్బీకి కొడిమ్యాల ఎస్సై అటాచ్

జగిత్యాలరూరల్: కొడిమ్యాల ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న కె.వెంకట్రామ్‌ను డీసీబీఆర్బీకి అటాచ్ చేస్తూ జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఐదు రోజుల క్రితం అదే పోలీస్‌స్టేషన్‌లో పనిచేసే కానిస్టేబుల్ బంధువులు ఎస్సై తీరుపట్ల పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. దీంతో విచారణ చేపట్టిన అధికారులు చర్యలు చేపట్టారు.

ట్రాన్స్‌కో విజిలెన్స్ అధికారుల తనిఖీ

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట, ఊటిపెల్లి గ్రామాల్లో ట్రాన్స్‌కో విజిలెన్స్ అధికారులు బుధవారం తనిఖీ చేపట్టారు. ఆయా వాడల్లో తిరిగి అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్నారా అనే విషయాలపై ఆరా తీశారు. అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న పలువురికి జరిమానా విధించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో ట్రాన్స్‌కో విజిలెన్స్ ఏడీఈ రాంకుమార్, అధికారులు పాల్గొన్నారు.

పశు వైద్యాధికారిని నియమించాలని వినతి

రాయికల్: మండలంలోని అల్లీపూర్ పశువైద్యశాలలో పశువైద్యాధికారిని నియమించాలని కోరుతూ బుధవారం సర్పంచ్ అత్తినేని గంగారెడ్డి, జిల్లా పశు వైద్యాధికారి వేణుగోపాల్‌రావును కలిసి వినతిపత్రం అందించారు. గ్రామంలో పశు వైద్యాధికారి రెగ్యులర్‌గా లేకపోవడంతో 5–6 గ్రామాలకు చెందిన పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారని, రెగ్యులర్ పశువైద్యాధికారిని నియమించాలని కోరారు.

అభివృద్ధిలో అందరు భాగస్వాములు కండి

కథలాపూర్: అభివృద్ధి పనుల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని ఎంపీపీ జవ్వాజి రేవతి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీటీసీలు, మండలస్థాయి అధికారులతో బ్లాక్ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. నీటి వసతి, పచ్చదనం పరిశుభ్రతకు ప్రాధాన్యత నివ్వాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం మండలంలో చేపట్టే పనుల గురించి చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జనార్దన్, ఎంపీటీసీలు బొడ్డు బాలు, కొండ ఆంజనేయులు, అధికారులు పాల్గొన్నారు.

సర్పంచ్‌కు సత్కారం

జగిత్యాల: బాల్య వివాహాల నివారణతో పాటు, ఫ్రెండ్లీ గ్రామపంచాయతీలకు కృషి చేసిన సర్పంచులను బుధవారం జిల్లా కేంద్రంలో అధికారులు సన్మానించారు. గొల్లపల్లి మండలం చిల్వాకోడూర్ గ్రామ సర్పంచ్ కందుకూరి పద్మావతిని అధికారులు సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ యాస్మిన్ బాషా, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, అదనపు కలెక్టర్ లత, జిల్లా సంక్షేమాధికారి భాస్కర్ పాల్గొన్నారు.

మారని పేరు..



ఏపీ హైకోర్టు పేరుతో ఉన్న వాహనం

మల్లాపూర్: తెలుగు రాష్ట్రాల హైకోర్టులు విభజన జరిగి ఐదేళ్లు గడుస్తున్నా.. తెలంగాణ న్యాయశాఖ అధికారులు, సిబ్బంది వినియోగిస్తున్న వాహనానికి మాత్రం ఇంకా ఏపీ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ అనే ఉంది. మల్లాపూర్‌లో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సుకు న్యాయశాఖ సిబ్బంది, అడ్వకేట్లతో కలిసి మున్సిఫ్ జడ్జి వాహనంలో వచ్చారు. ఆ వాహనంపై ఏపీ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ, హైకోర్టు ఆఫ్ ఏపీ అని ఉండడం అక్కడున్నవారిని ఆశ్చర్యానికి గురిచేసింది.

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం



రాయికల్: బహుమతులు అందిస్తున్న ఎస్‌వో



విద్యార్థిని వైభవికి ట్యాబ్ అందిస్తున్న కలెక్టర్

కథలాపూర్: మండలకేంద్రంలోని కేజీబీవీలో బుధవారం జాతీయ బాలిక దినోత్సవంను నిర్వహించారు. బాలికలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఆట, పాటలతో సందడి చేశారు. ప్రత్యేకాధికారి రాజకళ, టీచర్లు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని కేజీబీవీలో బుధవారం ఘనంగా జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన, ఉపాన్యాస పోటీలు నిర్వహించారు.

రాయికల్: మండలంలోని ఉప్పుమడుగు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం బాలికల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు బాలికా విద్య ప్రాముఖ్యత, బాల్య వివాహాలు వంటి అంశాలపై అవగాహన కల్పించి వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ శోభారాణి పాల్గొన్నారు.

మల్యాల: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో మొక్కలు నాటారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీడీపీవో నర్సింగరాణి, సూపర్‌వైజర్లు రాజశ్రీ, పవిత్ర పాల్గొన్నారు.

పెగడపల్లి: స్త్రీశిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు.కార్యక్రమంలో సూపర్‌వైజర్లు మహేశ్వరీ, సుభద్ర, సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీవో మహేందర్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టవిరుద్ధం

జగిత్యాలరూరల్: బాలికలకు బాల్య వివాహాలు చేయడం చట్టవిరుద్ధమని ఐసీడీఎస్ సీడీపీవో వీరలక్ష్మి అన్నారు. బుధవారం జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని జగిత్యాల రూరల్ మండలం ధర్మారం, లక్ష్మీపూర్ గ్రామాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆడపిల్లల పేరిట పండ్ల మొక్కలు నాటారు. బాలికలు విద్యను నిర్లక్ష్యం చేస్తే జీవితంలో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జానకి, టీచర్లు సరిత, రాజమణి తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను రక్షిద్దాం.. చదివిద్దాం



అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

జగిత్యాల: ఆడపిల్లలను రక్షిద్దాం... చదివిద్దామని అంగన్‌వాడీ టీచర్ యతీశ్వరి అన్నారు. జగిత్యాలలోని పలు అంగన్‌వాడీ సెంటర్లలో బేటి బచావో బేటి పడావో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలకు సంపూర్ణ సాధికారత ఇవ్వాలని, సమాన అవకాశాలు ఇచ్చినప్పుడే మహిళలు అన్ని రంగాల్లో ఉంటారన్నారు. కార్యక్రమంలో అంగన్ టీచర్లు పాల్గొన్నారు.

బేటి బచావో బేటి పడావోపై అవగాహన

కథలాపూర్: మండలంలోని గ్రామాల్లో బుధవారం బేటి బచావో బేటి పడావోపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో బాలికలకు రక్షణ కల్పిద్దామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక, సర్పంచ్ కూన సులోచన, అంగన్‌వాడీ టీచర్లు,మహిళ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పంచాయతీరాజ్ అధికారులపై విద్యుత్‌శాఖ డీఈ ఆగ్రహం

వెల్గటూర్ : పంచాయతీరాజ్ అధికారులపై విద్యుత్ శాఖ జగిత్యాల డివిజనల్ ఇంజనీర్ రాజిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం వెల్గటూర్ మండలంలో పర్యటించిన ఆయన శాఖాపూర్, పైడిపెల్లి గ్రామాల్లో జరుగుతున్న రోడ్డు వెడల్పు పనులను పరిశీలించారు. రోడ్డుకు ఇరువైపులా పోల్ షిఫ్టింగ్‌కు సంబంధించి పంచాయతీరాజ్ అధికారులకు గతంలోనే నోటీసులు ఇచ్చామని, అయినా ఇంతవరకూ ఎటువంటి స్పందనా లేదని,అధికారుల నిర్లక్ష్యం తో ఎలక్ట్రికల్ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వెల్గటూర్ ఏ.ఈ శ్రీనివాస్, విద్యుత్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైవర్ల అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ

మెట్‌పల్లి: డ్రైవర్ల అప్రమత్తతతోనే ప్రమాదాలు నివారించవచ్చని సీఐ లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో బుధవారం డ్రైవర్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విధుల్లో ప్రతిభ కనబర్చిన పలువురు డ్రైవర్లను సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ డ్రైవింగ్ చేసే సమయంలో సెల్‌ఫోన్ వినియోగించవద్దన్నారు. క్రాసింగ్‌ల వద్ద వేగంగా వెళ్లవద్దని, గమ్యం చేరే వరకు ప్రతి క్షణం జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎం వేదవతి, గట్ల రమేశ్, శ్రీనివాస్, శేఖర్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు డిపోలో డ్రైవర్స్ డే

కోరుట్ల రూరల్: పట్టణంలోని ఆర్టీసీ బస్ డిపోలో బుధవారం డ్రైవర్స్ డే ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై కిరణ్ కుమార్ మాట్లాడుతూ డ్రైవర్లు తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తారన్నారు. కోరుట్ల ఎంవీఐ రంజిత్ కుమార్ డ్రైవర్లకు ప్రమాదాల నివారణకు సూచనలు చేశారు. అనంతరం అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన డ్రైవర్లను ఎస్సై, ఎంవీఐలు శాలువాలతో సత్కరించి గులాబీపూలు అందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డిపో మేనేజర్ జీపీ సింగ్ నాయక్, మెకానికల్ అసిస్టెంట్ , సెక్యూరిటీ ఆఫీసర్, డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

దృఢమైన శరీరంలోనే స్థిరమైన మేథస్సు

జగిత్యాల: దృఢమైన శరీరంలోనే స్థిరమైన మేథస్సు ఉంటుందని వైద్య శాఖ ప్రోగ్రాం అధికారి శ్రీనివాస్ అన్నారు. బుధవారం రక్తహీనత ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా మైనార్టీ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. పిల్లల్లో పోషకాహార లోపానికి మూల కారణం ఆహారపు అలవాట్లు అని, పరిశుభ్రత, వ్యక్తిగత ప్రవర్తన, ఆహారం గురించి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి సంతోష్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్రీధర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాలు వితరణ

కోరుట్ల: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పూర్వవిద్యార్థులు బుధవారం కళాశాల గ్రంథాలయానికి పుస్తకాలు అందజేశారు. కార్యక్రమానికి కోరుట్ల ఆర్డీవో రాజేశ్వర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు పుస్తకాలతో మంచి విజ్ఞానాన్ని పొందవచ్చన్నారు. పోటీ పరీక్షలకు పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు చెన్నా విశ్వనాథం, ఉపాధ్యక్షుడు కోటగిరి ప్రసాద్, ప్రిన్సిపాల్ నీలి వాసవి, వైస్ ప్రిన్సిపాల్ నరేష్, గ్రంథాలయ ఇంచార్జ్ మల్లికార్జున్,అధ్యాపకులు పాల్గొన్నారు.

కేపీఎల్ క్రికెట్ టోర్నీకి వేలం

కోరుట్ల: పట్టణంలో నిర్వహించే కోరుట్ల ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహణకు బుధవారం వేలం పాటలు నిర్వహించారు. పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు అన్నం అనిల్, కౌన్సిలర్ తిరుమల గంగాదర్ గౌడ్, బీజేపీ నాయకుడు రుద్ర శ్రీనివాస్ లు వేలం పాట ప్రారంభించారు. 200 మంది క్రీడాకారులు పాల్గొనగా 10 ప్రాంచైజీలు పోటీ పడ్డట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కేరళ స్కూల్ కరస్పాండెంట్ బారీ, అధ్యక్షుడు మెయిజ్, బాల్‌రాజ్, షబ్బీర్, గఫూర్, అబుబాకర్, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థినులకు వైద్య పరీక్షలు

వెల్గటూర్ : మండలంలోని కుమ్మరిపల్లి కస్తూర్బా గాంధీ విద్యార్థినులకు పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం వైద్య పరీక్షలు చేశారు. ప్రపంచ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని రక్తహీనత ముక్త్‌భారత్‌లో భాగంగా వైద్యపరీక్షలు నిర్వహించినట్లు డా.శ్రవణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా 103 మంది విద్యార్థినులను పరీక్షించిన వైద్యులు 29 మందికి రక్తహీనతతో బాధపడుతున్నట్లు గుర్తించి వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.కార్యక్రమంలో డా.విజయ్, సీహెచ్‌వో జగన్నాథం, ఏఎన్ఎం అంజలి, ఫార్మాసిస్ట్ సంధ్య, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

విద్యార్థుల జోష్



జగిత్యాల: జిల్లా కేంద్రంలోని నవ్య బాలికల జూనియర్ కళాశాలలో వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ శ్రీపాద నరేశ్ ప్రిన్సిపాల్ ఈశ్వర్‌కుమార్ పాల్గొన్నారు.